## విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి బాధ్యులపై చర్యలు చేపట్టాలి

నర్సంపేట, అక్టోబర్ 3 : మండలంలోని మూడు చెక్కలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్, జిల్లా అధ్యక్షుడు భూక్యా జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. విషయం బయటకు రాకుండా దాచిన పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌పై సమగ్ర విచారణ చేసి, సస్పెండ్ చేయాలని కోరారు. ఐటీడీఏ ఏటూరునాగారం పీవో స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నర్సంపేట రూరల్, అక్టోబర్ 3 : మండలంలోని మహేశ్వరంలో బాధిత కుటుంబానికి పలువురు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. మహేశ్వరం గ్రామానికి చెందిన మిషన్‌భగీరథ హెల్పర్ బండి మానస పాముకాటుతో వారం రోజుల కితం మృతి చెందింది. అయితే గతంలో తండ్రి సురేశ్ కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. దీంతో దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించి, బాధిత కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. కాగా, మంగళవారం ఇదే గ్రామానికి చెందిన శ్రీ అరుణోదయ విద్యానికేతన్ 2009-2010 బ్యాచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు హెచ్‌ఎం మోర్తాల గోపాల్‌రావు ఆధ్వర్యంలో మానస కుటుంబానికి రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం ఆర్థిక సాయం అందించిన దాతలను గ్రామ పెద్దలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఉన్నారు.

## గౌడగర్జన సభకు తరలిన గీతకార్మికులు

నర్సంపేట,అక్టోబర్ 3 : నిర్మల్‌లో నిర్వహించే గౌడ గర్జన సభకు గీత కార్మికులు తరలివెళ్లారు. మంగళవారం నర్సంపేట డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి గీత కార్మికులు, గౌడకులస్తులు, మోకు దెబ్బ నాయకులు నిర్మల్‌లో నిర్వహిస్తున్న గౌడ గర్జనకు తరలివెళ్లారు. మోకు దెబ్బ రాష్ట్రప్రధాన కార్యదర్శి రమేశ్ వాహన శ్రేణిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుల దామాషా ప్రకారం చట్టసభల్లో గౌడులకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకన్నగౌడ్, ముంజాల రాజేందర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు గొడిశాల సదానందంగౌడ్, జిల్లా, డివిజన్,మండల నాయకులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

## సెకండ్ డాక్టర్స్ కాలనీలో సుభాష్‌నగర్ ఏర్పాటు..

పోచమ్మమైదాన్, అక్టోబర్ 3 : వరంగల్ 12వ డివిజన్ సెకండ్ డాక్టర్స్ కాలనీ పరిధిలో సుభాష్‌నగర్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన సుభాష్‌నగర్ బోర్డును స్థానిక కార్పొరేటర్ కావటి కవిత సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక విజ్ఞప్తి మేరకు కాలనీలో ఉన్న ప్రజల విజ్ఞప్తి మేరకు.. కొత్తగా కార్పొరేషన్ తరుపున సుభాష్‌నగర్ ఏర్పాటు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు శ్రీనివాస్, రంగనాయకులు టెంపుల్ డైరెక్టర్ నర్సయ్య, సుభాష్‌నగర్ గౌరవ వాధ్యక్షుడు రుద్రవీర భద్రయ్య, రాంబాబు, సాయికుమార్, శ్రీనివాస్, సారయ్య, వెంకన్న పాల్గొన్నారు.



12వ డివిజన్‌లో సుభాష్‌నగర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవిత

## మాదిగల విశ్వరూప పాదయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ, అక్టోబర్ 3 : ఈ నెల 7న అలంపూర్ నుంచి మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ప్రారంభమవుతున్నందున మంగళవారం కాశీబుగ్గ చౌరస్తాలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఎంఎస్పీ వరంగల్‌తూర్పు ఇన్‌చార్జి ఈర్ల కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం విద్యా ఉద్యోగరంగాల్లో న్యాయమైన వాటా కోసం మాదిగ ఉపకులాల భవిష్యత్ కోసం, సామాజిక న్యాయం కోసం మంద కృష్ణ ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం వెంటనే పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి తమ ఆకాంక్షను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మాదిగలను నిర్లక్ష్యం చేస్తే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈసంపెల్లి రాజు, కలకొట్ల గిరి, కోట రాజు, బైరిపాక డేవిడ్ రాజ్, అమృతరావు, రమేశ్, చిన్న, పూసల శ్రీనివాస్, ఈసంపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను పెంపొందించాలి

### ఏఎంవో సారయ్య

ఖానాపురం,అక్టోబర్ 3: విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని ఎంఏవో సారయ్య సూచించారు. ఈ మేరకు మంగళవారం బుధరావుపేట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి విద్యాసామర్థ్యాల పరిశీలన పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసామర్థ్యాల పరిశీలన పరీక్షలు విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. అదేవిధంగా 6 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న ఉన్నతి కార్యక్రమాన్ని పరిశీలించారు. రాబోయే టెన్త్ వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎక్కువ మంది 10 జీపీఏ సాధించాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో కొరవడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రత్నమాల, ఎంఎన్‌వో చరణ్‌సింగ్, హెచ్‌ఎం ఆరీఫుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ శశిధర్, సీఆర్పీ భాస్కర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పరిశీలిస్తున్న ఏఎంవో సారయ్య

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### వైద్యాధికారి ఆచార్య

నల్లబెల్లి, అక్టోబర్ 3 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆచార్య సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానంగా వానకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడంతో రోగాలను నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ హెచ్‌సీభా, హెల్త్ అసిస్టెంట్ కిషన్, ఏఎన్ఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఆచార్య

# ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకోవాలి

### జీవన్ జ్యోతి పొదుపు సంఘం అధ్యక్షుడు రమేశ్

దుగ్గొండి, అక్టోబర్ 3: జీవితంలో ప్రతి ఒక్కరూ పొదుపు అలవాటు చేసుకోవాలని అదే జీవితంలో వెలుగును నింపుతుందని జీవన్ జ్యోతి పొదుపు సంఘం అధ్యక్షుడు పొన్నం రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రేఖంపల్లికి చెందిన జీవన జ్యోతి పొదుపు సంఘం సభ్యుడైనా గోపతి నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన భార్య రమకు సంఘం ప్రమాద బీమా చెక్కును కార్యవర్గ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ జ్యోతి పొదుపు సంఘం అధ్యక్షుడు పొన్నం రమేశ్ మాట్లాడుతూ గ్రామస్తుల ఆర్థిక అభివృద్ధికి ప్రజలకు అందుబాటులో ఏర్పడిన గ్రామ జీవనజ్యోతి పొదుపు సంఘంలో ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరి పొదుపు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు జీవన జ్యోతి పొదుపు సంఘం గణకుడు మాదారపు రమేశ్, కానుగుల రమేశ్,పొన్నం కొ మురయ్య, మాదారపు కోటి, మనోజ్, కానుగుల అశోక్, గాదం రవి, పొన్నం రమేశ్, రామారావు, సత్యంతో మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న జీవన్ జ్యోతి పొదుపు సంఘం సభ్యులు

# ప్రజాపోరాటాలే సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న వంగాల రాగసుధ

నర్సంపేట,అక్టోబర్ 3 : ప్రజా పోరాటలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని నర్సంపేట బీఎల్ఎఫ్ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ డివిజన్ కన్వీనర్ వంగాల రాగసుధ సూచించారు. మంగళవారం నర్సంపేటలో బీఎల్ఎఫ్ సమావేశం ఓంకార్ భవన్‌లో అల్లీసాబ్ అధ్యక్షతన నిర్వహించారు. కాగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాటికి 93 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు సామాజిక తరగతులు వివక్షతకు గురవుతున్నారని ఆరోపించారు. పెట్టుబడి దారుల దోపిడీకి గురవుతున్నారన్నారు. బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలు కార్మిక, కర్షక, కూలీల శ్రమను కొల్లగొట్టేలా కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజలందరినీ చైతన్య పరుస్తూ లాల్ నీల్ ఐక్యతతో ముందుకు సాగి ఉద్యమాలను బలోపేతం చేయాలని కోరారు. ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్, డివిజన్ కమిటీ సభ్యులు మార్త నాగరాజు, కొమురయ్య, భాస్కర్, డీ సాంబయ్య, బీ సురేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

### మాజీ ఎమ్మెల్యే ఏవీఆర్

# గొప్ప సహకార వాది

### విత్తన సంఘం పాలకవర్గ సభ్యుడు, సహకారవాది జయపాల్‌రెడ్డి

నర్సంపేట రూరల్, అక్టోబర్ 3 : దివంగత మాజీ ఎమ్మెల్యే అర్శనపల్లి వెంకటేశ్వరరావు (ఏవీఆర్) గొప్ప సహకార వాది అని విత్తన సంఘం పాలకవర్గ సభ్యుడు, సహకారవాది గోపు జయపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముగ్ధుంపురం గ్రామ శ్రీరామ ధాన్య రైతు విత్తన ఉత్పత్తిదారుల పరస్పర సహకార పరపతి సంఘం ఆవరణలో ప్రముఖ న్యాయవాది, దివంగత మాజీ ఎమ్మెల్యే ఏవీఆర్ 14వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆవరణలోని ఏవీఆర్ విగ్రహానికి పలువురు విత్తన సంఘం పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏవీఆర్ రైతు కూలీలకు ఎనలేని సేవ చేసిన మానవతావాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ధాన్య రైతు విత్తన ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు అర్శనపెల్లి ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నామాల సత్యనారాయణ, నూనె కుమారస్వామి, నల్ల స్వప్న, రంజిత్‌కుమార్, సిద్ధ కుమార్, పాలకవర్గ సభ్యులు, పురుషుల పొదుపు సంఘం సభ్యులు కోటేశ్వర‌రావు, కృష్ణమూర్తి, పవన్‌కుమార్, రంజిత్‌కుమార్, సుమన్, సాంబయ్య, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

## అప్పల్‌రావుపేటలో పాఠశాల పరిశీలన..

నెక్కొండ,అక్టోబర్ 3: స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణ తీరును మండల నోడల్ అధికారి రవికుమార్ బుధవారం పరిశీలించారు. నెక్కొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అప్పల్‌రావుపేటలోని మండల ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. నవంబర్3న నిర్వహించే జాతీయ సర్వే పరీక్షకు సిద్ధంగా ఉండాలన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, రవీంద్రనాథ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, జాన్‌నాయక్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శోభరాణి, నరేందర్ పాల్గొన్నారు.


పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి రవికుమార్